

# పగ

యస్. పురుషోత్తమాచార్య

కుక్కి మంచంలోంచి కుమిలి పోతున్న మనస్సు సరికట్టుకుని దిగ్గున లేచి నుంచున్నాడు శేషగిరి. ప్రతీకారవాంఛ పడగలెత్తిబుస కొట్టసాగింది. మెలికలు తిరిగిన కండరాలుగల తన దేహాన్ని క్షుణ్ణంగా పరీక్షించుకున్నాడతను. నిగనిగ లాడు



తూన్న తన శరీరం రఘుపతి పెంపకంలో నిగ్గుతేరింది. తను అతని ఉప్పు తింటూ బ్రతుకుతున్నాడు.

శేషగిరి మేధస్సు క్షణం మూగవోయింది.

"యిన్నాళ్ళూ తను బ్రతికింది ఎవరి కోసం?" ప్రశ్నించుకున్నాడతను.

అతని అంతరంగం మారు పలికింది.

"రాజ్యం కోసం! నీ చెల్లెలి సౌభాగ్యం కోసం!"

"అవును! తను బ్రతికింది రాజ్యం కోసమే! కాని రాజ్యం సౌభాగ్యమూ, మాన ప్రాణాలూ, రెండూ మంట గలసిపోయాక కూడా తానెందుకు బ్రతికి వున్నట్టు?"

"రాజ్యం కోసమే!" అంతరాత్మ అరిచింది.

నిజం! తాను జీవించి వున్నది నిజం! కాని తను అర్ధప్రాణంతో, కొన ఊపిరి

వున్న మనసుపడే వేదనను యింకా ఎను బాధని గరళంలా మ్రింగుతూ ఈలోకంలో యింకా జీవించే వున్నాడు.

"ఎందు కోసం?"

"నీ చెల్లెలికోసం! ఆ గొంతు కోసిన వ్యక్తిపై ప్రతీకారాన్ని తీర్చుకోవటం కోసం!" అంతరాత్మ ఖచ్చితంగా పలికింది.

నిజం! నిజం! తను జీవించి వున్నది అందుకొరకే! తనలో దావానలంలా దహించి వేస్తోన్న ప్రతీకార వాంఛ తనకు జీవాన్ని పోస్తోంది. రాజ్యం రగిల్చి వెళ్ళిన పగల సెగల ఆవిర్లు తనకు ప్రాణాన్ని పోసి యింకా నిల్పుతున్నాయి.

"కాని పగసాధింతే దెవరిపై."

"రఘుపతిపై!"

"ఎలా? ఎలా కోరేవు చెల్లీ? రఘుపతిపపై శేషగిరిక్కి పగ జనించదని!"—శేషగిరి అరుస్తూ కుప్పలా కుక్కి మంచంలోకి జారేడు. అతని అరపులు పెంకుటింటి కప్పు చిల్లులోంచి దూసుకుపోయేయి.

దోసిల్లో మొహాన్ని చేపగిలవేసి నిర్లిప్తంగా ఆలోచనలోకి జారేడు శేషగిరి. అలజడి గమనించి పడగనేల వాల్చి పరుగులు తీసిన నాగరాజులా అతని ఆవేశం చప్పున చల్లారిపోయింది.

"అన్నయ్యా!"

రాజ్యం కంఠస్వరం వినిపించినట్లు ఆ బెంచి. [illegible] పన! మంచంలో కూర్చునే చుట్టూ కలయ చూచాడతను. ఎక్కడ చూచినా ఏ వైపు పరికించినా రాజ్యం వదనమే లీలగా కనిపిస్తూన్న అనుభూతికి లోనయ్యాడతను. చివరికి కండ్లు గట్టిగా మూసుకున్నాడు.

మనుషుల్లోని రంగులింత త్వరగా మారతాయని తానెన్నడూ విశ్వసించ లేదు. తన్ను కుడి భుజంగానూ, రాజ్యాన్ని సోదరిగానూ స్వీకరించిన రఘుపతి నైజంలో యింతటి మార్పు రావటమూ, తద్వారా యింతటి నైచ్యాని కొడిగడతాడని తాను స్వప్నావస్థలో కూడా ఊహించలేక పోతున్నాడు. అందుకే తొలికోడి కూసేవేళ ప్రాణాలు వదులుతోన్న తన చెల్లెలి నోటనే ఆ విషయం వినీ కూడా తను నమ్మలేక పోతున్నాడు. తను తింటోన్న ఉప్పుకలిగించిన ఘాటైన నమ్మకమది!

"కాని జరిగిందేవిటి?" సింహావలోకనం చేసుకోసాగాడు శేషగిరి.

—రఘుపతి పెద్ద దొరసుంచు! తను ఫోర్తు ఫారం దాకా చదువుకున్న అతని పరిచారకుడు. అతను వేటకెళ్ళినప్పుడు టాపులేని జీపులో వెనుక వైపునుంచి లోనికి దూకనున్న చిరుతపులికి ఎదురుగా నిలిచిన తన బలమైన పిడికిలిపోటు దాని డొక్కలో శరాఘాతంలా పనిచేసింది. నాటినుంచే తను అతని కుడి భుజమూ

బహిఃప్రాణమూ అయి కూర్చున్నాడు. ఆ రోజున్నే వేట ముగిసింతర్వాత తనని తమ పెంకుటింటి ముందు దింపుతుండగా వెలికి వచ్చిన రాజ్యాన్ని "చెల్లెమ్మా!" అని సంబోధించిన రఘుపతి నెలా అనుమానించేది?

పంచినీళ్ళకని వెళ్ళి దిగుడు బావిలో జారిపడిన రాజ్యాన్ని తన కళ్ళముందే పట్నం డాక్టరు దగ్గరికి తీసికెళ్ళి ఆదుకున్న రఘుపతే ఈ నేరంచేసి వుంటాడా? తను నెల్లూరి కోడెల్ని ఖరీదు చేయటానికి వెళ్ళిన పది రోజులూ తన చెల్లెలి ఆలనా పాలనా గమనించిన రఘుపతిబాబు నెలా అనుమానించేది?

కాని తను నెల్లూరినుంచి రాగానే రాజ్యం ఏమంది?

"అన్నయ్యా! పెద్ద కాపందులకు మనింట ఏం పని? ఆయన అనుక్షణమూ మనింటికి రావటం నా కెంత మాత్రమూ ఇష్టంలేదు." రాజ్యం పలుకుల్ని తానా నాడు వినిపించుకోకుండా ఎలా వుండగలిగేడు? తనందంత మట్టి బుర్రేం? అవును! రాజ్యం తనది మట్టిబుర్రనే అంటూ వుండేది. కావచ్చును మరి!

శేషగిరికి తల బద్దలయిపోతున్నట్లుగా తోచింది. కాళ్ళు ముడుచుకుని కణతలు నొక్కుకుంటూ కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

"రాజ్యం చితి యింకా ఆరలేదేమో?" గొణుక్కున్నాడతను. రాజ్యంలేని ఆ యింట్లో పదహారు గంటల కాలం నిశ్శబ్దంగా గడిచింది. మళ్ళీ అతనిలో ఆలోచనలు ముసురుకోసాగాయి.

రఘుపతి తండ్రిగారి హయాం నుండే ఆ కుటుంబానికి అనుచరులుగా సాగి వస్తోన్న తమ సంబంధాలు తననీ నాడు రఘుపతికి కుడిభుజంగా నిలబెట్టాయి. గ్రామంలో రఘుపతికెంత పలుకుబడి వుందో తనక్కూడా అతని మూలంగా అంతే వుండేది. అతనిక్కూడా భయపడని వారు తనని సింహస్వప్నంగా తలపోసేవారు. కాని ఈ స్వల్ప వ్యవధి అనగా ఈ పదహారు గంటల కాలంలోనే తనని ఎంతో లోకువగా చూస్తున్నారెందువల్ల ?

"అయ్యో పాపం!" అనిపించుకుంటున్నది పదహారు గంటల క్రితవే కాలగర్భంలో కలసిపోయిన తన ఒక్కగా నొక్క చెల్లెలు రాజ్యం.

కాని తను? "చచ్చు వెధవ! కండ బలమేగాని బుద్ధిబలం లేని దౌర్భాగ్యుడు! పౌరుషంలేని బడుద్ధాయి!" యిలా ఎన్నో రకాల వాఖ్యానాల్ని పదహారు గంటల కాల మధ్యంలోనే విన్నాడు.

శేషగిరి విసురుగా లేచి నుంచున్నాడు.

కిటికీ వంక చూచాడు.

ఆవల చీకటి చిల్లుల కంబళిని సవరించుకొంటోంది. అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ

సైరన్ ధ్వని దూరంగా రైల్వేస్టేషను ప్రక్కనుంచి వినిపిస్తోంది. సాయంకాలం ఏడయింది.

చలిగాలి రయ్! మంటూ వీచింది. దీపం నిలువెల్లా ఊగిపోయింది. శేషగిరి నీడ గోడపై అల్లల్లాడింది. దీపాన్ని కిటికీలోంచి తీసి వెనక్కి నడుస్తూ ఠక్కున ఆగిపోయాడతను. కిటికీ తలుపులు దడదడ లాడాయి. దీపం ఆరిపోయింది. అతని మస్తిష్కం తీవ్రంగా పనిచేయసాగింది.

తను గత సాయంకాలమే క్రొత్తగా ఖరీదు చేసిన కోడెల్ని పొలంనుంచి తోలుకొస్తున్నాడు. శివాలయం దాపులోకి రాగానే చెప్పుల్ని విడిచి నమస్కరించటం తన కలవాటు. తను అప్పుడే విన్నాడు.

"అన్నయ్యోయ్!" అనే ఆక్రందనని. తను ఎన్ని జన్మల పాపాన్ని మూటకట్టుకున్నాడో? అందుకే అప్పుడు రాజ్యం గొంతుకని పోల్చుకోలేకపోయాడు.


అప్పుడే శివుని గుడిలోంచి ఓ ఆకారం పరుగెత్తింది. గాజులు గలగల్లాడాయి. ఆ స్త్రీ ఆకారాన్ని తరుముతూ మరో వ్యక్తి వెడుతుండడం లీలగా కనిపించింది.

"పాణీ! నీ వాప్రక్కనుంచి రా!" ఆ స్త్రీని తరుముతూన్న మనిషి ఎవరినో హెచ్చరించింది.

దాంతో మరో నీడ రెండవ వైపుకు పరిగెత్తింది. ఇంతలో తన చేతి నుండి ఓ నెల్లూరి కోడె తప్పుకొంది. సందిగ్ధంలో పడిపోయాడు తను. పల్లెటూరిలో సర్వసాధారణంగాజరుగుతూండే ఇలాంటి గొడవల్లో కాలు దూర్చేదా? లేక కొత్తగా కొన్న కోడె దూడ జాడకెళ్ళేదా? ఏదో మొగుడూ పెళ్ళాల గొడవ కావచ్చునని తాను సరిపెట్టుకుని కోడె వెళ్ళిన దిశకి పరిగెత్తేడు. దాన్ని వెంటనేపట్టుకోని పక్షంలో అది నెల్లూరి వైపు పరుగు తీస్తుంది. పశువు క్రొత్తచోట మచ్చికయే వరకూ ఆ కొన్న వాళ్ళు పడేబాధని అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. చివరకి దాన్ని చాలా దూరంలో పట్టుకుని పశువుల దొడ్లో కట్టేసి యింటికెడుతూ అలవాటు ప్రకారం రఘుపతిబాబుకి చెప్పటానికి వెళ్ళాడు. అప్పుడతను దీర్ఘాలోచనలో మునిగిపున్నాడు. తనను చూచి ఉలిక్కిపడినట్లుగా యిప్పుడు జ్ఞాపకం వస్తోంది.

"వెళ్ళొస్తానండీ!" అన్నాడు తను. "వెళ్ళచ్చుండవోయ్!" అంటూ ప్రతి రోజులా పలకకుండా రఘుపతి మౌనంగా అంగీకార సూచకంగా తలూచటం తన నెంతో ఆశ్చర్యపరచింది.

తను యిల్లు చేరేసరికి రాజ్యం ఇంట్లో లేదు. ఆవిడ గురించి ప్రక్కింట్లో వాకబు చేయగా బంగారయ్య శెట్టింట్లో పేరంటానికెళ్ళిందని తెలిసింది. చాలాసేపు ఎదురు చూసి విసిగి తను బంగారయ్య శెట్టింటికి వెళ్ళాడు. చీకటిపడకముందే అక్కడ




నుంచి వెళ్ళిపోయిందట రాజ్యం. మరెక్కడి కెళ్ళిపుంటుందో తెలీక ఆవిడ తరచూ వెళ్ళే యిళ్ళన్నీ తిరిగివస్తూ వచ్చి బండకేసి చూడగా అక్కడ జనం గుమిగూడి వుండడం గమనించి అటుకేసి వెళ్ళటంతోనే తెలిసిన విషయం వినగానే తన అరికాళ్ళ క్రింది నేల కదిలిపోయినట్లయింది. లోకంలో తనని పన్నెండో ఏటా రాజ్యాన్ని ఎనిమిదో ఏటా వదిలి గోదావరి పడవమునకలో ప్రాణాలు కోల్పోయారు తన తల్లిదండ్రులు. ఆనాటి నుంచీ రాజ్యాన్ని తన చేతులపై పెంచాడు తను. ఆ రాజ్యం కాస్తా మంచినీళ్ళ బావిలో పడిపోయిందన్న సంగతి తెలియగానే తనకేమీ తోచక పిచ్చిగా ఆ వంక పరుగుతీశాడు.

కొన ఊపిరితోవున్న తన చెల్లెల్ని తన చేతులతోనే బావిలోంచి పైకి తీశాడు తను. చివరిసారిగా కన్ను తెరచిన రాజ్యం తన్ను మనసారా తడుముతూ అన్న మాటలే తనప్రాణాల్ని ముక్కలుముక్కలుగా చెక్కేస్తున్నాయి.

"అన్నయ్యా! రఘుపతి.... వాడు.... వాడు.... నన్ను నాశనం చేశాడు.... వాడి అంతం చూడు!...." అంటూండగానే రాజ్యం కళ్ళు మూతలు పడ్డాయి. అంతే!

తన చెల్లెలి చితి మండింది. ఇంకా మండు తూనే ఉండవచ్చు.

తన చెల్లెలి శీలాన్ని దోచుకుని దాని మరణానికి కారణ భూతుడయిన వాడు రఘుపతేనన్న విషయాన్ని ఊరంతా నమ్ముతోంది. కాని తనే నమ్మలేక పోతు న్నాడు. హఠాత్తుగా అతని వెన్నునెవరో చరిచినట్లయింది.

"మరి! మరి! శివాలయం? ఆ ఆక్రం దన." శేషగిరి హృదయం ఘోషిల్లుతూ గర్జించింది.

"పాణి!" తను విన్న పేరు తటాలున బుర్రలోకి వచ్చింది శేషగిరికి. గుండెల్లో అగోచరమయిన గుబులు బయలుదేరింది. పాణి!? రఘుపతి తన తరఫున ప్రక్క గ్రామంలోని ఎన్నికల్లో అతన్ని నుంచో బెట్టేడు. నిజం నిప్పులా కనిపించింది శేష గిరికి.

అతను యింట్లోంచి తూనీగలా పరి గెత్తా డవతలికి. పలుపు లెన్నో వెనుక బడిపోయాయి. చెరువుకట్టూ, కాలువగట్టూ అన్నీ వెనకబడ్డాయి. ప్రక్క ఊరి నిర్మా నుష్యపు వీధుల్లో నడవసాగేడతను. పాణి యింటి దాపులోకి రావడంతోనే ఏవో మాటలు లీలగా వినిపించసాగాయి.

"తన కుడిభుజంలాంటి శేషగిరి చెల్లెల్నే నాశనం చేసేడుగదా? మన క్కూడా అలాంటి అపకారమేదీ రఘుపతి తల పెట్టడన్న నమ్మక మేవిటి? పోలిం గయ్యేలోగా ఏదో ఒకటి నిర్ణయించుకో వాలి మనం." అంటున్నా రెవరో.

"అవును. అదీ నిజమే! రాత్రి ఆ వెధవపనికి సహాయం కూడా తీసుకోవటం నాకెంతో బాధగా వుంది. పాపం! ఆ పిల్ల ప్రాణాన్ని నిలుపునా తీసుకుంది" అంటూన్న పాణి కంఠస్వరాన్ని విన్నాడు శేషగిరి.

అంతే!

సర్పానికి విషం కోరల్లోకి వచ్చినట్లుగా శేషగిరి అంతరంగంలోంచి ప్రతీకార వాంఛ పళ్ళ మధ్యకి వచ్చి నలిగిపోయింది. అతని ప్రక్కటెముకల అంతర్భాగంలో చేటలు విసిరినట్లుగా ఊగిసలాడసాగా యతని శ్వాసకోశాలు.

శేషగిరి కదిలేడు. ఈసారి అతను పరుగెత్తటం లేదు. అతని ఎదజ్వలించి పోతోంది. ఆవేశార్ద్రి నయనాలతో భారంగా కదులు తున్నాడతను. తమ గ్రామం పొలి మేరలోకి రాగానే అతని అడుగులు కాస్త వడివడిగా పడసాగేయి.

తలుపులు తెరిచి క్షణం ఆగేడు శేష గిరి. గదిలో ఓ మూలగా నుంచో బెట్టిన గునపం అతని మనసులో మెదిలింది. దాన్నందుకుని విసురుగా భుజాన వేసుకుని కదిలాడతను. ఈసారి అతని ప్రతి అడుక్కీ నేల అదిరి పోసాగింది.

అర్ధరాత్రి!

రఘుపతి యింటిగేటు వేసివుంది. పిట్ట

గోడ ఎక్కి నడుస్తూ మేడపైకి సులభం గానే చేరాడు శేషగిరి. గదిలో వెలుగు కనిపిస్తోంది. కిటికీ సందుల్లోంచి చూచాడు. గది మధ్య మంచంలోంచి బిక్క చచ్చి కూర్చుని వున్నాడు రఘుపతి. దిక్కులు చూస్తూన్న రఘుపతినా స్థితిలో చూచిన శేషగిరిలో ఆవేశం కట్టలు త్రెంచుకొంది. తలుపును గునపంతో ఒక దెబ్బ వేసేసరికి రెక్కవిరిగి నేలపై పడిపోయింది.

ఎగిరి పడ్డాడు రఘుపతి. అతని చేతిలో పిస్టల్ నిగనిగ లాడుతోంది. కాని అతను వణికిపోతున్నాడు. కాల్చాలన్న వివేకం నశించింది మనిషిలో.

శేషగిరి గునపాన్ని లేవనెత్తేడు విసురుగా.

రఘుపతి భయంతో వెర్రికేక వేయటానికి నోరు తెరిచేడు కాని అంతలోనే "కెవ్వు!" మన్న కేకవినిపించింది. అది ఓ స్త్రీ కంఠస్వరం! ఎక్కణ్నుంచో దీనంగా వినిపిస్తోంది. శేషగిరి ఆగిపోయేడు.ఆ కంఠస్వరం రాజ్యం ధ్వనిలా తోచిందతనికి. దాంతో అతను వచ్చిన పనిని మరిచి పోయాడు. అతనిలోని మానవత్వం మేల్కొంది. గిర్రున వెనుదిరిగి పిట్ట గోడదూకి ఆ కేక వినిపించిన వైపుకు పరిగెత్తాడతను.

రఘుపతి ఆ సంఘటనతో కోలుకో గలిగేడు. వికటాట్టహాసం చేస్తూ మరో గదిలోకెళ్ళి తలుపులు మూసుకున్నాడు.

రఘుపతి యింటి వెనుక పెరట్లో మామిళ్ళ మధ్య ఎవరో పెనుగులాడుతూ వుంటం గమనించాడు శేషగిరి. మసక చీకట్లో కనిపిస్తోన్న స్త్రీమూర్తి రఘుపతి భార్య నర్మద! ఆమెని బలాత్కరిస్తూన్న వ్యక్తి ఆవిడ మేనబావ భుజంగరావు.

క్షణం శేషగిరిలో జ్ఞాపకాల తెరకదలాడింది. నర్మదను రఘుపతితో వివాహం కాకముందు ఆవిడ తలిదండ్రులు రామెని భుజంగానికే యివ్వాలనుకోగా ఆవిడ అంగీకరించకపోవటం విషయ మతనికి తెలుసు. కాని యిప్పుడీ భుజంగరావక్కడి కెలా తయారయ్యాడో అతని కెంతకీ అంతు పట్టలేదు.

నర్మద గింజుకొంటూ మళ్ళీ అరిచింది నిస్సత్తువగా.

---

రోగి : నాకేంటో అప్పుడప్పుడూ నన్ను చంపేసుకోవాలని పిస్తుందండి డాక్టరూ!

డాక్టరు: ఆ సంగతి నా కొదిలెయ్యవోయ్!

రాజ్యం జ్ఞాపకం వచ్చింది శేషగిరికి. అతనిలో ఆవేశం ఆవహించింది. తన చెల్లెలికి చేసిన అన్యాయానికి రఘుపతికీ విషంగా విధి ప్రతీకారించబోతోంది. పతిత కానున్న భార్యతో అతను జీవితాంతమూ కుమిలి పోవాలి! హాయి! అతనిపై తను యిక సాధించేదేమీ లేదనుకుంటూ వెనుదిరగబోయాడతను.

నమ్రత అసహాయంగా మరోసారి కేక వేసింది.

శేషగిరి ఓ అడుగు వెనక్కి వేసేడు.

నమ్రత దీనంగా భుజంగరావుని ప్రార్థిస్తోంది.

శేషగిరిలో ఆవేశం స్థానే కరుణ నిండు కుంది. అతనికి రాజ్యానికి జరిగిన అవమానం కళ్ళముందు భయంకరంగా కనిపించింది. "అంతే? ఆ దుష్కార్యం తర్వాత నమ్రత కూడా నిండు ప్రాణాన్ని బలవంతంగా కోల్పోతుందా?"

జరగబోయేదతని కళ్ళముందు కదలాడింది.

వెనక్కి విసురుగా తిరిగేడు.

తన చెల్లెలికి జరిగిన అన్యాయం లాంటి దెవరికయితేనేమి? మరో స్త్రీకి జరగరాదు.

త్వరపడ్డాడు శేషగిరి.

గునపాన్ని బలంగా భుజంగరావు వంక విసిరేడు. గాలికి విద్యుద్ఘాతంలా తగిలిన గునపం దెబ్బకి విరుచుకు పడ్డాడు భుజంగరావు. నమ్రత అతన్ని తప్పించుకోబోయి తూలిపడటంలో నుదుటికి దెబ్బ తగిలి స్పృహ కోల్పోయింది. కంగారులో పరిస్థితిని గమనించకుండా ఆవిడను లేవనెత్తడానికి వంగేడు శేషగిరి.

అంతే!

అలా వొంగిన శేషగిరి వెన్నులోకి అప్పుడే వెనుక వైపునలేచి నుంచున్న భుజంగరావు చేతిలోని గునపం విసురుగా దూసుకెళ్ళింది.

"అమ్మా!" అన్న ఆర్తనాదం నిశీధిలో ప్రతిధ్వనించింది.

మేడ మీద రఘుపతి అదిరిపడ్డాడు!

ఊరు ఉలిక్కిపడి లేచింది!

అప్పుడే తొలికోడి కూసింది!!